# ఆయనగారి ప్రియురాలు

## యం.ఓ.యస్దాన్

''అక్కా నేను లోపలకు రావచ్చా?'' అన్న మాటలు విని తలెత్తి గుమ్మంవైపు చూశాను. గీత నవ్వుతూ నిలబడి వుంది.

''రా గీతా కొత్తవారిలా పర్మిషన్ అడుగుతున్నావేం?'' బొత్తాలు కుడుతున్న చొక్కా పక్కన పెట్టి అన్నాను.

గీత వచ్చి నా ఎదురుగా కూర్చుంది. ఈ ఇల్లుగల వాళ్ళ అమ్మాయి ఆమె. క్రింది పోర్షన్‌లో వాళ్ళుండి పై పోర్షన్ మాకు అద్దెకిచ్చారు. గీతకు దాదాపు పాతికేళ్ళు వుంటాయి. ఇంకా పెళ్ళి కాలేదు. ''ఎక్కడా సంబంధాలు కుదరడంలేదు'' అంటోంది గీత వాళ్ళమ్మ శాంతమ్మ.

గీత నన్ను అక్కా అని ఆయన్ను బావగారు అంటు ఆప్యాయంగా పిలుస్తోంది. వాళ్ళమ్మ కూడ మాతో సానుకూలంగానే వుంటోంది. ఆయన ఆఫీసుకు వెళ్ళాకా.. వచ్చి నాతో ఏదేదో కబుర్లు చెబుతుంటోంది గీత. మాకు పిల్లలు లేకపోవడం, అత్తమామలు పల్లెటూర్లో వుండడంవల్ల- ఆయన ఆఫీసుకు వెళ్ళిపోతే నేను ఒంటరిగా వుండాల్సొచ్చేది, కానీ గీత వల్ల నాకు మంచి కాలక్షేపం అవుతూ ఉంటుంది.

''అక్కా ఏమిటీరోజు పరధ్యానంగా వున్నావు?'' అంటు గీత నా భుజంపై చేయి వేయడంతో ఆలోచనల నుంచి తేరుకొని ''ఆ.. ఏం లేదు చెప్పు. ఏమిటి విశేషాలు? నిన్న సినిమాకు వెళ్ళావు కదా? ఎలా వుంది?'' అంటూ మాటలు కలిపాను.

''ఏం సినిమాలే అక్కా. అసలు సినిమాకెందుకు వెళ్ళానా.. అనిపించింది.''

''ఏం ఎందుకని?''

గీత దీర్ఘంగా నిట్టూర్చి, ''అక్కడో చూడకూడని దృశ్యం చూశానక్కా'' అంది.

''ఏం చూశావేమిటి?'' కుతూహలంగా అడిగాను.

''సరే కానీ అక్కా, ముందీ విషయం చెప్పు. మీది లవ్ మ్యారేజా..? లేక అరేంజ్డ్ మ్యారేజా.''

''మాది పెద్దలు నిశ్చయించి చేసిన వివాహమే. ఏం? ఎందుకలా అడుగుతున్నావు?''

''ఏం లేదు. బావగారు నీతో ప్రేమగానే వుంటుంటారా? లేక మీరిద్దరు.. తరచు...''

''ఆగిపోయావేం? గొడవ పడుతుంటారా అనే కదా అడగబోయావు. మా ఇద్దరి మధ్య ఎలాంటి గొడవలూ లేవు. ఆయన నన్ను ప్రాణ సమానంగా చూసుకుంటున్నారు. అలాంటి వ్యక్తి నాకు భర్తగా దొరకడం నిజ్జంగా నా అదృష్టమే.''

''సారి అక్క. అయితే నేను పొరబడినట్టున్నాను. వస్తానూ'' అంటు లేవబోయింది.

నేను ఆమె చేయిపట్టి కూర్చోబెడుతూ ''ఏదో చూడకూడనిది చూశానన్నావు.. అదేమిటి చెప్పు'' నవ్వుతూ అన్నాను.

''అబ్బా అదేం లేదులే వదిలేయి'' తప్పించుకునే దానికి చూసింది.

నేను ముఖం సీరియస్‌గా పెట్టి ''ఇదిగో ఇలా సగం మాటల్లో ఆపి సస్పెన్స్‌లో పెట్టావంటే నీకీ అక్కమీద ఒట్టే'' అన్నాను.

ఆమె నావైపు బాధగా చూస్తూ- ''అబ్బా బుద్ధి తక్కువై నీదగ్గర ఈ విషయం ప్రస్తావించాను. ఒట్టు వేసి నన్ను కట్టిపడేశావు. ఇక చెప్పక ఛస్తానా? నిన్న నేను వెళ్ళిన సినిమాకి బావగారు కూడ వచ్చారు.''

ఫక్కున నవ్వాను నేను. ''ఇదా నువ్వు చూడకూడని విషయం? ఆయన నాతో చెప్పే వెళ్ళారులే.''

''ఆయనతోపాటు మరో స్త్రీ కూడ వుంది. చాల మాడ్రన్‌గా, అందంగా ఉంది. వాళ్ళిద్దరూ అతి దగ్గరగా మసులుకొంటు జోకులేసి నవ్వుకోవడం నేను కళ్ళారా చూసి నమ్మలేకపోయాను.'' బాంబు పేల్చింది గీత.

ఆమె చెప్పిన మాటలు ఒక్కక్షణం నా బుర్రలోకి ఎక్కలేదు. అర్ధమైన వెంటనే నా నోట మాట రాలేదు. దుఃఖం పొంగుకొచ్చింది. ఆందోళనను నొక్కిపెట్టి- లేని నవ్వును ముఖంపై తెచ్చుకొని ''నువ్వు పొరబడినట్టున్నావు గీతా'' అన్నాను.

''స్కైబ్లూ జీన్స్‌పై రెడ్ అండ్ బ్లాక్ చెక్స్ వున్న షర్టు కదా నిన్న బావగారు వేసుకొని వున్నది?''

''అవును'' అప్రయత్నంగా అన్నాను.

''అయితే ఖచ్చితంగా బావేనక్క'' తేల్చి చెప్పేసింది గీత.

నేను మౌనంగా తలొంచుకున్నాను. క్రింది నుంచి శాంతమ్మ, ''గీతా'' అని పిలవడంతో- ''అమ్మ పిలుస్తోంది వెళ్ళొస్తానక్కా'' అంటు చకచక వెళ్ళిపోయింది గీత. ఏమిటీ అమ్మాయి చెబుతున్నది? నిజమా? అబద్ధం చెప్పాల్సిన అవసరం ఆమెకేముంది? మరి ఈయనగారు పైకి రాముడిలా నటిస్తూ, బయట కృష్ణుడిలా రాసలీలలు వెలగబెడుతున్నాడా? ఏమిటో ఏమీ అర్ధం కావడంలేదు. ఆయనొస్తే కాని ఏ విషయం తెలదు. అయితే ఆవేశం కన్నా ఆలోచనతోనే కూపి లాగితే మంచిదనిపిస్తోంది నాకు.

• • •

రాత్రి మామూలుకంటే ఆలస్యంగా వచ్చారాయన. వస్తూనే ఎప్పటిలాగే నన్ను వాటేసుకొని ముద్దివ్వబోయారు. ఆయనకా అవకాశం ఇవ్వకుండా దూరంగా నెట్టేశాను.

''ఏమిటి శ్రీమతిగారు అలకపాన్పు ఎక్కినట్టున్నారు?''

''....''

''మైడియర్ రేణు అలక అతివకు అందమే కాదనను. కానీ ఆ అలకకు కారణమేమిటో సూచనప్రాయంగా అయినా తెలియజేస్తే దాన్ని తగ్గించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తాడు మీ సేవకుడు.''

తన ధోరణిలో అంటు నా ఎదురుగా వచ్చి తలొంచుకుని బుద్ధిమంతుడిలా నిలబడ్డాడు.

''ఇలాంటి మాటల్లో ఆరితేరే కదా మీరు నాతో ఆడుకుంటున్నారు?'' కోపంగా అన్నాను.

ఆయన నాకు చేరువై తన చూపుడు వ్రేలితో నా చుబుకాన్ని ఎత్తి నా కళ్ళలోకి సూటిగా చూస్తూ ''ఏ పిచ్చిమొద్దు ఏమైందివాళ నీకు? ఎందుకిలా ప్రవర్తిస్తున్నావు?'' అన్నారు.

''ఔను నేను పిచ్చిమొద్దునే. అందుకే నేనంటే మీకంత అలుసైపోయింది'' బాధగా అన్నాను నేను.

''అయ్యో.. నేనేదో మాట వరుసకంటే నువ్వు ఫీలౌతున్నావా?'' నొచ్చుకుంటున్నట్టు అని తల పట్టుకొని కుర్చీలో కూర్చున్నారాయన.

ఆయనవైపు తదేకంగా చూశాను. అదే అమాయకమైన ముఖం! అలాంటాయన ఎంతకు తెగించారు! సరే దొరకనంత వరకూ దొంగైనా దొరేకదా. చూద్దాం

అనుకుంటు ఆయన వద్దకు వెళ్ళి ''కాఫీ పెట్టన లేదంటే ఒకే సారి భోంచే స్తారా?'' అడిగాను.

ఆయనో క్షణం నావైపు అదోలా చూసి ''భోజనం వడ్డిస్తే సంతోషిస్తాం దేవి గారు'' వ్యంగ్యంగా అని బట్టలు మార్చుకునే దానికి లోనికెళ్ళారు.

నేను డైనింగ్ టేబుల్ సర్దుతున్నానన్న మాటేకానీ నా మనసంతా ఆయనగారి ప్రియురాలి చుట్టూ తిరగసాగింది. ''చాలా మాడ్రన్‌గా అందంగా వుంది'' అన్న గీత మాటలు నా చెవుల్లో ప్రతిధ్వనించ సాగాయి.

ఆయనొచ్చి డైనింగ్ టేబుల్ ముందు కూర్చొని ప్లేటందుకున్నారు. అన్నం, కూరలు వడ్డించాను.

''నువ్వు కూర్చో'' అన్నారు.

''ఆకలిగా లేదు'' ముక్తసరిగా జవాబిచ్చాను.

''అబ్బా.. నువ్వు తింటేకాని నా కడుపు నిండదన్న సంగతి నీకు తెలియదా?''

పెళ్ళామే ప్రపంచమైనట్టు ఎంచక్కా నటిస్తున్నారో చూడు!

''అవును ఈరోజు ఎందుకింత ఆలస్యమైంది?'' అడిగాను.

''రేపు ఆఫీసు పనిమీద వైజాగ్ వెళుతున్నాను. టికెట్లు రిజర్వేషన్ చేపించి వస్తున్నాను.''

టికెట్టు కాదు టికెట్లూ అంటే వెళుతున్నది ఈయనొక్కరే కాదన్నమాట.

''ఎవరెవరు వెళుతున్నారు?''

''నేను మా కొలీగ్.''

కొంపతీసి ఈయనగారు రేపు తన ప్రియురాలితో కలసి వెళ్లడంలేదు కదా!?


''ఏవండి నాకు చాలారోజుల నుంచి వైజాగ్ చూడాలని వుంది. నేను మీతో రానా?'' ఆశగా అడిగాను.

నేనూహించినట్టే ఆయన కంగారు పడుతూ, ''రేపు కుదరదు రేణు, మరెప్పుడన్న వెళ్దాంలే'' అంటు చేయి కడుక్కునే దానికి లేచారు.

నా మెదడంతా తుఫాను రేగిన సముద్రంలా.. ఆలోచనలతో అల్లకల్లోలం అయిపోసాగింది. దేవుడా.. ఏమిటి నాకీ పరీక్ష! ఈయన పేరుకి సూర్యుడు. కారెక్టర్‌లో రాముడా? కృష్ణుడా..? తేలేదెట్టా!

నేను కిచెన్ సర్దేసి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాను. ఏదో పుస్తకం చదువుతున్న ఆయన నన్ను చూసి పుస్తకం పక్కనే పెట్టి ''భోజనం చేశావా లేదా?'' అడిగారు.

తల అడ్డంగా వూపాను నేను. ఆయన లేచి వెళ్ళి ఫ్రిజ్జులో నుంచి నాల్గు బత్తాయి పండ్లు తీసి అప్పటికప్పుడు జ్యూస్ చేసి తీసుకొచ్చి నాకిచ్చి ''తాగు ఇది. ఆకలికీ, ఆరోగ్యానికీ, అందానికీ అన్నిటికీ మంచిది'' అన్నారు.



ఏమిటీమనిషి మనస్తత్వం? ఇలాంటి పనులతో నన్ను కట్టిపడేస్తుంటారు. కానీ, ఆయన నోటి వెంట 'అందం' అన్న పదం రావడంతో నాలో మళ్ళీ ఆ దిక్కుమాలిన ప్రియురాలి ఆలోచనలు చోటు చేసుకున్నాయి.

జ్యూస్ గ్లాస్ పక్కన పెట్టి ఆయన కళ్ళల్లోకి సూటిగా చూస్తూ ''ఏవండీ- నేను అందంగా లేనా?'' దీనంగా అడిగాను.

ఆయనో క్షణం నావైపు విస్మయంగా చూసి నన్ను తన కౌగిలిలో బంధించి, ''నువ్వు అందానికే అందానివి'' అంటు ముద్దుల వర్షం కురిపించారు. ఆ ఆప్యాయంతకే నేను కరిగిపోతుంటాను. ఆయన మాటలూ, చేతలూ నాలోని కోపాన్ని నెట్టివేశాయి. ఎప్పుడైతే కోపం స్థానంలో ప్రేమ ప్రవేశించిందో నన్ను నేను మరచి పూర్తిగా ఆయనకు అంకితమైపోయాను.

అమోఘమైన తన శృంగార చేష్టలతో నన్ను ఏదేదో లోకాల్లో విహరింప జేశారాయన. తీగలా ఆయన్ని అల్లుకుపోయాను. అలా ఎంతోసేపటికి అలసి నా గుండెలపై తల వాల్చి పడుకున్నారాయన. నా శరీరమైతే తృప్తి పడింది కాని మనసులో మాత్రం 'ఆ' అసంతృప్తి ముల్లు గుచ్చుకుంటూనే వుంది.


• • •

సాయంత్రం వైజాగ్ వెళ్ళేందుకు సర్దాల్సిన వాటి గురించి చెప్పి ఆఫీసుకు వెళ్ళిపోయారాయన.

ఆయన వెళ్లిన పది నిమిషాలకు ఫోన్ రింగైతే రిసీవర్ ఎత్తాను. నేను హలో అనేనా అన్లేదు. ఈలోగానే అవతల నుంచి ఓ ఆడ కంఠం ''హలో సూర్యా హౌ ఆర్ యు? రాత్రంతా కలలో వచ్చి తెగ అల్లరి చేశావు. నీవల్ల నాకు రాత్రంతా నిద్రలేదు తెలుసా? సరేలే ఎలాగూ వైజాగ్ వెళుతున్నాముగా అక్కడ మూడు రాత్రులు నిన్ను నిద్రకు దూరం చేసేస్తాను. అన్నట్టూ చెప్పడం మరిచాను. ఈ సీజన్‌లో వైజాగ్‌లో చలెక్కువ. అందుకని ఓ స్వెటర్ తెచ్చుకో. అఫ్‌కోర్స్ నీ పక్కన వెచ్చగా నేనుంటాననుకో... కానీ మరీ పబ్లిక్‌లో బావుండదు కదా? నాకు భలే థ్రిల్లింగ్‌గా వుంది సూర్యా నీతో కలిసి ప్రయాణం.. 'వావ్' ఎప్పుడెప్పుడు సాయంత్రమవుతుందా.. అని వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నాను. ఓకే బై. మ్ము..చ్..'' అంటు ముద్దిచ్చి ఫోన్ పెట్టేసింది.

నిశ్చేష్టురాలై అలాగే నిలబడిపోయాను నేను. నా వళ్ళంతా ఏదో కంపనం! రాక్షసి.. ఫోన్లో కాబట్టి సరిపోయింది. అదే ఎదురుగా వుంటే గొంతు నులిమి చంపేస్తుండేదాన్ని.

ఎంత ధైర్యం దానికి. ఇంటికి ఫోన్ చేసి అంత బరితెగించి మాట్లాడుతుందా. అంటే వీళ్ళ ఘనకార్యం ఎన్నాళ్ళ నుంచి కొనసాగుతుందో? ఇప్పటి వరకూ



## బొగ్గు ఎలా ఏర్పడింది?

250 మిలియను సంవత్సరాలకు పూర్వం భూమిలో కుళ్ళి, చీకి నశించిపోయిన శాకాద్రవ్యాలు మెల్లిగా రసాయన వియోగం చెందడంవల్ల బొగ్గు ఏర్పడింది.

## కాఫీలో పాలు, పంచదార

1683లో పోలండ్ ప్రయాణీకుడు ఫ్రాన్జ్ జియోగ్ కోల్షిట్స్కీ ఆస్ట్రియా వియన్నాలో ఒక కాఫీ హోటలును స్థాపించాడు. ఇతడే మొట్టమొదట కాఫీతో పాలు పంచదార కలిపి వాడిన మొదటి వ్యక్తి.

## ది నైట్ వాచ్

'రెమ్ బ్రాన్డెట్' యూరప్‌లో హాలండ్‌కు చెందిన ప్రఖ్యాత చిత్రకారుడు. ఇతను చిత్రించిన చిత్రాలు ఇప్పటికి ప్రపంచంలో అనేక ఆర్టు గ్యాలరీల్లో భద్రపరచబడ్డాయి. భార్య మరణావస్థలో వున్నప్పుడు 'ది నైట్ వాచ్' అనే చిత్రాన్ని చిత్రించాడు. ఇంతటి గొప్ప చిత్రకారుడు దారిద్ర్యంతో మరణించాడు. ఇతడు ఐదువందల యాభై చిత్రాలను సృష్టించాడు.

## నల్లబరిచే వృక్షం

బీహార్‌లోని చోటా నాగపూర్‌లో 'కాలాకరయ్యా' అనే పెద్ద వృక్షం నీడ పడిన భూ ప్రదేశం నల్లబడిపోతుంది. అక్కడ మొలిచిన గడ్డి కూడా నల్లబడిపోతుంది.

## కాలుష్యం

న్యూయార్కు నగరంలోకంటే కార్లు, ట్రక్కులు చాలా తక్కువగా వున్నా, కార్బన్ మోనాక్సైడ్ వాయువులతో కలకత్తా నగరం న్యూయార్కు కంటే రెట్టింపు కాలుష్యవంతం అవుతుంది. ఢిల్లీ నగరంలో కాలుష్యం భయంకరమైన స్థాయికి చేరుకుంది. ఇప్పుడు ప్రపంచంలో మిక్కిలి ఎక్కువ కాలుష్యమైన నగరం ఢిల్లీ.

- జి.శారద

అనుమానం మాత్రమే వుండింది. ఇప్పుడది నిజమని తేలిపోయింది.

ఈ స్థితిలో నేను నిదానమే ప్రధానం అంటు చేతులు కట్టుకొని కూర్చుంటే పరిస్థితి నా చేయి దాటిపోయే ప్రమాదముంది! అందుకే బాగా ఆలోచించి స్థిరంగా ఓ నిర్ణయానికి వచ్చాను.

ఆయనొచ్చేలోగా నాకు కావాల్సినవన్నీ సమకూర్చుకున్నాను. సాయంత్రం ఆయనొచ్చి హడావిడిగా తయారౌతుంటే, ''ఏవండి ఇక్కడ ఒంటరిగా వుండి నేనేం చేసేది? అందుకని నేను మా అమ్మనాన్నల వూరికి వెళ్ళొస్తానండి'' అన్నాను.

ఆయన 'సరే' అనడంతో నేను బయలుదేరాను. ''ఆయన వైజాగ్ వెళుతున్నారు. నేను మా పుట్టింటికి వెళుతున్నాను. ఇల్లు కాస్త గమనిస్తూ వుండండి'' అని శాంతమ్మగారికి చెప్పి చెరో ఆటో ఎక్కాము. ఆయనెక్కిన ఆటో రైల్వేస్టేషన్‌వైపు, నేను ఎక్కిన ఆటో బస్టాండ్ వైపు బయలుదేరాయి.

కాస్సేపాగి రైల్వేస్టేషన్‌కు పోనివ్వమన్నాను ఆటోని. ఎందుకంటే నేను వెళ్ళాలనుకుంటున్నది మా పుట్టింటికి కాదు వైజాగ్‌కి. ఆయనకు తెలీకుండా ఆయన్తో పాటే నేను వెళ్ళాలి. అక్కడ వారిద్దరినీ రెడ్ హ్యాండ్‌గా పట్టుకోవాలి. అది నా ప్లాన్. అందుకే ముందే సిద్ధం చేసుకున్న బురఖాని ధరించాను.

• • •

మొండి పట్టుదలతో రెండురోజులు వైజాగ్‌లో ఆయన్ను నీడలా వెంటాడాను. అక్కడి నుంచి నేరుగా మా వూరు చేరుకున్నాను. అక్కడ నాన్నగారితో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడి సాయంత్రానికి మా ఇల్లు చేరుకున్నాను.

రాత్రి పొద్దుపోయాక వచ్చారాయన. మరుసటి రోజు ఉదయం మామూలుగానే ఆఫీసుకు వెళ్ళిపోయారు. ఆయన వెళ్ళిన అయిదు నిమిషాల తరువాత ఫోన్ మ్రోగింది. కార్డ్‌లెస్ అందుకున్నాను. నేనూహించినట్టే ఆయన అజ్ఞాత ప్రియురాలి ఫోనది!

''హాయ్ సూర్యా డార్లింగ్! ఏమిటి బాగా అలసిపోయినట్టున్నావు! ఇవాళ ఆఫీసుకు వెళ్ళవా? ప్రయాణాన్ని బాగా ఎంజాయ్ చేశాము కదూ? నీ విషయం ఏమిటో కానీ నాకు మాత్రం జీవితాంతం మరచిపోని మధురానుభూతిని మిగిల్చావు. అందుకు కానుకగా అందుకో ఈ ముద్దు.'' అంటు ఫోన్లోనే ముద్దు పెట్టింది.

ఆమె అంటున్నది మౌనంగా వింటూనే గబగబా మెట్లు దిగి క్రిందకు వచ్చాను నేను. క్రింద శాంతమ్మ ... ఇంట్లోకి నడిచాను. నా అనుమానం నిజమైంది. ... అటు తిరిగి ఫోన్లో మాట్లాడుతుంది. ఇప్పుడు ... కార్డ్‌లెస్‌లో వింటున్నది ఆమె గొంతునే!

ఫోన్ పెట్టేసి ఇటు తిరిగిన గీత నన్ను చూసి ఖం... తింది. ''అ..క్కా... నువ్వా ఎప్పుడొచ్చావు?'' తడ... డింది.

నేను ఆమెను సమీపించి ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ ''మనిద్దరం ఒక తల్లి కడుపులో పుట్టకపోయినా నిన్ను నా సొంత చెల్లెలి లాగే చూశాను. అలాంటిది నువ్వు నా కాపురంలో చిచ్చు పెట్టాలని చూస్తున్నావంటే నేను నమ్మలేకపోతున్నాను. ఎందుకిలా ఆయన మీద నాకు చాడీలు చెబుతూ అజ్ఞాత ప్రియురాలి పాత్ర పోషిస్తున్నావు?'' అన్నాను.

గీత భోరున ఏడుస్తూ నా కాళ్ళమీద పడిపోయింది. ''నన్ను క్షమించక్కా...'' అంటూ.

• • •

ఆరోజు మధ్యాహ్నం మా నాన్నగారు నేను చెప్పినట్టే గీత కోసం మంచి సంబంధం తెచ్చారు. వాళ్ళకు గీత నచ్చడం ముహూర్తం బాగుందంటూ తాంబూలాలు పుచ్చుకోవడం వెంట వెంటనే జరిగిపోయింది.

పాతికేళ్ళు నిండినా ఇంకా పెళ్ళి జరక్కపోవడంతో గీతలో ఏదో నైరాశ్యం చోటు చేసుకొంది. ఆ డిప్రెషన్‌తో, పచ్చగా వున్న మా కాపురంలో అబద్ధాలు చెప్పి చిచ్చుపెట్టి మేము తగువులేసుకొని విడిపోతే చూసి ఆనందించాలనుకొంది.

ఇందులో కొంతవరకు నా తప్పు కూడా వుంది. ఆమె చెప్పింది మూర్ఖంగా నమ్మాను. దేవుడు లాంటి ఆయన్ని అనుమానించి నీడలా వెంటాడాను. అక్కడ ఆయన ఆయన్తోపాటు ఓ బట్టతల పెద్దమనిషి తప్ప మరెవరూ కనిపించలేదు నాకు.

అప్పుడు... ఇంతవరకు జరిగిన సంఘటనలన్నీ మననం చేసుకుంటే ముందుగా నాలో అనుమానపు బీజం నాటిన గీత గుర్తుకు వచ్చింది. తరువాత, ఫోన్లో ఆస్త్రీ కంఠం ఎక్కడో విన్నట్టు అనిపించినా బాధలో పట్టించుకోలేదు నేను. స్థిమితంగా ఆలోచిస్తే- అది గీత పనేనని అనిపించింది. పనిలో పనిగా వూరెళ్ళి గీత కోసం వెంటనే మంచి సంబంధం తెమ్మని నాన్నగారితో చెప్పి వచ్చేశాను.

నేనూహించినట్టే ఆమె ఫోన్ చేయడం, పట్టుబడిపోవడం జరిగింది. ఇప్పుడెంతో ప్రశాంతంగా హాయిగా వుంది నాకు. కానీ ఆయన్ను అనవసరంగా అనుమానించినందుకు గిల్టీగా వుంది.

ఆ రాత్రి ఆయన కౌగిలిలో గువ్వలా వొదిగిపోతూ, ''నన్ను క్షమించండి'' అన్నాను.

ఏమీ పట్టించుకునే మూడ్‌లో లేరాయన. అందాల విందు ఆరగిస్తూ ఆనంద లోకాల్లోకి నన్ను లాకెళ్ళిపోతున్నారు!

★

